# రాముని తోక

మన తెలుగువాళ్ళకి ఏవేమి అక్షరాలు వ్రాస్తామో అవన్నీ పలకటం ఒక ఆచారం. మన భాష మిగతా భారతీయ భాషల్లాగానే ఫోనిక్ లాంగ్వేజ్ అనీ, తెలుగుకీ ఇంగ్లీషుకీ ముఖ్యమైన తేడాలు ఏమిటీ అనీ ఇంతకు ముందే మనం చెప్పుకున్నాం. కాకపోతే ఇలాటి తేడాల వల్ల, నాలాటి వారి అనుభవాలెలా వున్నాయో చూద్దాం ఈసారి.

మా ఆఫీసులో జేన్ అని ఒకమ్మాయి వుంది. తెల్ల అమెరికన్. ఆ అమ్మాయి పేరు జెఎఎన్ఇ అని వ్రాసుకుంటుంది. అది సర్వసాధారణం. మా డిపార్ట్‌మెంట్లోనే ఇంకొకమ్మాయివుంది. ఆ అమ్మాయి పేరుని జెఎఎన్ అని వ్రాసుకుంటుంది. నాకు మొదట్లో ఆమె పేరు ఎలా పలకాలో అర్థం కాలేదు. జాన్ అంటే మగ పేరు. జేన్ అందామా అంటే పేరులో ఇ లేదు. చివరికి ఆమెనే అడిగాను, నీ పేరు ఎలా పలకాలో చెబుతావా అని. ఆమె నవ్వి 'నన్ను యాన్ అని పిలవాలి. మా స్కాండెనేవియన్ భాషల్లో జె అనే అక్షరాన్ని య అని పలుకుతాం' అంది.

అప్పుడే నాకు గుర్తుకి వచ్చాడు మా డ్రాఫ్ట్సమెన్. అతని పేరు వేన్ పెబుల్స్, విఎఎన్ పెబుల్స్. నేను వేన్ అని వ్రాసినా అది వేణులోని వే కాదు. వాన్ అని వ్రాస్తే అది వాడులో వా కాదు. తాతా సుమో వాన్‌ని ఏమంటామో ఆ వా అన్నమాట. ఇలా చెబుతున్నప్పుడు అనిపించింది స్వరాక్షరమైన (ఫోనిక్ లాంగ్వేజ్) మన భాషలోనూ అడ్డంకులున్నాయని.

ముళ్ళపూడి వెంకటరమణగారు చెప్పిన జోకు ఒకటి ఈ సందర్భంలో చెప్పుకోవాలి. తెలుగులో అన్ని అక్షరాలూ పొల్లుపోకుండా పలుకు తామనే గర్వం ఒకటివుంది మనకి. తమిళ్‌వాళ్ళు అన్ని అక్షరాలూ పలకరనీ మనమే అన్నీ సరిగ్గా పలుకుతామనీ మనం చెప్పుకుంటాం. దాని గురించి చెబుతూ ఆయన అంటారూ - అన్ని అక్షరాలూ నోరారా మనం పలుకుతామని చెప్పుకోవటంలో నిజంలేదు. ఉదాహరణకి ఒక సూర్యనారాయణ వున్నాడనుకో. అతన్ని పిలిచేటప్పుడు మనం ఒరే సూణ్ణాణా అని పిలుస్తాం కానీ, 'ఒరే సూర్యనారాయణా' అని పిలవం కదా.

'ఒరే నా ఈపు గోకరా' అనేవాడు మా పెద్ద మామయ్య.

మా ఇజీనారంలో అని రాయుడుగారంటే, మరి బీమారంలో అనేవారు రామారావుగారు. మన భాషలోనే మనం ఇన్ని రకాలుగా పలుకుతున్నప్పుడు ఇతర దేశాల భాషలు పలకటంలో మనం పప్పులో కాలేయటంలో ఆశ్చర్యం ఏముంది?

మళ్ళీ మా ఊరు వద్దాం. నాకు తెలిసిన మెక్సికన్ మిత్రుడొకడున్నాడు. అతని పేరుని జెయుఎఎన్ అని వ్రాసుకుంటాడు. అది జూన్ కాదు. జుయూన్ కూడా కాదు. వాన్. ఇందాకి చెప్పిన తాతా సుమో వాన్‌లో వా కాదు, వామనుడులో వా. లాటిన్ భాషలోకి వస్తే అక్షరాలు పలకటంలో జాగ్రత్త అవసరం. జె అంటే వ అనుకున్నాం కదా. ఎప్పుడూ కాదు. కొండొకచో మాత్రమే. సుజాతని ఆఫీసులో సుహోతా అని పిలుస్తారు. ఇంగ్లీషు జెని స్పానిష్‌లో హ అని పలుకుతారు. జెయిఎస్‌యుఎస్ మామూలుగా జీసెస్ కావాలి. కానీ మాఊళ్ళో స్పానిష్ వాళ్ళతో మాట్లాడేటప్పుడు హేసూస్ అవుతుంది. జెఒఆర్‌జిఇ స్పెల్లింగ్ వున్న ఒక టెక్నీషియన్ తనని జార్జి అని పిలవమంటాడు. జార్జి ఎలా అవుతుంది అంటే నవ్వి, 'అవదు. కానీ అది మీకు పలకటానికి సులభం. మా స్పానిష్‌లో అది హోర్హె' అన్నాడు. అతని హోరు విని అరే ఇంకానయం ఎలా పలకాలో చెప్పాడు అనుకున్నాను. అలాగే కొత్తగా అమెరికా వచ్చిన మనవాళ్ళు మెక్సికో మిరపకాయల్ని జలపినో మిరపకాయలనేవారు. తర్వాత తెలిసేది జలపినో మిరపకాయలు కాదు హలపీనియో మిరపకాయలని.

ఇది ఒక జోకులా చెప్పుకుంటారు కానీ , నేనూ ఇలాటి కేసులు కొన్ని చూశాను. మంచి తమాషాగా వుంటుందిది. ఒక చైనీస్ ఆయనా ఒక బ్రిటిష్ - ఆయనా ఫోన్‌లో మాట్లాడుకుంటున్నారు. బ్రిటిష్ అడుగుతున్నాడు 'హు ఈజ్ స్పీకింగ్?' అని. చైనీస్ అతను జవాబు చెబుతాడు 'హు ఈస్ స్పీకింగ్' అని. అదేనయ్యా నేనడుగుతున్నది హూ ఈస్ స్పీకింగ్ అంటాడు బ్రిటిష్. మళ్ళీ చైనా అతను 'చెప్పానుకదా హు ఈస్ స్పీకింగ్ అని. ఇంతకీ మీరెవరు' అని అడుగుతాడు. 'వాట్' అంటాడు ఇంగ్లీష్. చైనా మనిషి కోపంగా 'నేను అడిగేది మీరెవరూ అని' అంటాడు. 'నీకు చెప్పానుగా వాట్ అని' అంటాడు మిష్టర్ వాట్, మిష్టర్ హు చెంగ్‌తో.

నేను మొదటిసారి ఫ్రాన్స్ వెళ్ళినప్పుడు, ఇంగ్లీషూ ఫ్రెంచ్ పాకెట్ బుక్ కొనుక్కున్నాను. అది డిక్షరీ కాదు. ఫలానా హోటల్‌కి దారి ఎటు. టాయిలెట్ ఎక్కడ వుంది. ఈ వస్తువు ధర ఎంత. ఇంతకన్నా ఇచ్చే బేరం ఏదన్నావుందా. రైల్లో టిక్కెట్లు ఎక్కడిస్తారు మొదలైన రోజువారీ విషయాల్లో వాళ్ళతో మాట్లాడటానికి వీలుగా వుంటుందది. పారిస్‌లో అడుగుపెట్టిన రోజే నా పుస్తకం సహాయంతో ఫ్రెంచ్ భాషలో మాట్లాడటానికి ప్రయత్నంచేశాను. పుస్తకంలో చెప్పినట్టు మాట్లాడటానికి ప్రయత్నం చేస్తుంటే ఎవరికీ అర్థమైనట్టులేదు. వాళ్ళ ముఖాల్లో తెలుస్తూనే వుంది. కారణం మరేం లేదు. ఫ్రెంచ్ పదాల్లో సగం అక్షరాలు అసలు పలకరు. పలకనప్పుడు మరి అంత శ్రమ తీసుకుని ఎందుకు వ్రాస్తారో నాకు ఈ నాటికీ

అర్థం కాదు. కొంతమంది నా భాష అర్థం కాకపోయినా, నా బాధ అర్థం చేసుకుని, నా భాషని అర్థంచేసుకోవటానికి ప్రయత్నంచేశారు. కొంతమంది అంత ఓపిక లేకనో, విదేశీయుల మీద అంత సదభిప్రాయంలేకనో, దురభిమానం వల్లనో నేను పుస్తకం చూస్తూ మాట్లాడుతుంటే పట్టించుకోకుండా అలా అలవోకగా వెళ్ళిపోయేవారు.

హ్యూస్టన్ టీవీ స్టేషన్‌లో వార్తలు చదివే ఆయన ఒకతనున్నాడు. అతని పేరు బాబ్ బ్రుడో. ఫ్రెంచ్ అతను. అతని పేరు తెంగ్లీషులో వ్రాస్తే బియుడిఆర్ఓ. కానీ ఫ్రెంచ్‌లో బియుడిఆర్ఇఎయుఎక్స్ అని వ్రాస్తారు. అంకెలు చెప్పటం కూడా చాల పొడుగు. ఎవరినన్నా టైము అడిగితే వాళ్ళు టైము చూసుకుని చెప్పేసరికీ టైము మారిపోతుందని ఒక జోకు వుంది ఫ్రెంచ్ వారి మీద. అలాగే రెండెవూ అనే ఫ్రెంచ్ మాటకి స్పెల్లింగ్ రెండు కాదు, నాలుగు రెట్లు పొడుగు వుంటుంది.

ఇలా ఒకే అక్షరాన్ని విదేశీభాషల్లో రకరకాలుగా పలకటంలో ఆశ్చర్యంలేదు. కానీ భారతీయ భాషల్లోకూడా వాటిని మార్చి పలకటం చూస్తుంటే గమ్మత్తుగా వుంటుంది. మన వందేమాతరం బెంగాలీ వాళ్ళకి బందేమాతరం. ఈ బా బెంగ వంగదేశంలో వాళ్ళని వాధ పెడుతూంటుంది.

మేము త్రివేండ్రంలో వుండేటప్పుడు అశోక్ బెనర్జీ అని మంచి స్నేహితు డుండేవాడు. ఈ 'వా బా' ల మీద మేమిద్దరం రోజూ బాదించు కునేవాళ్ళం. అతన్ని నేను బెనర్జీ అనకుండా వానర్జీ అని పిలిచేవాడిని.

నా మేనల్లుడు శ్యాంని ఉత్తరదేశీయులు హైదరబాదీయులు ఆదరా బాదరాగా ష్యాం అని పిలిస్తే, అతను ఆ బాదుడు భరించలేక పోయేవాడు. నేను ష్యాంని కాదు, నన్ను శ్యాం అని పిలవండి మొర్రో అని మొత్తుకునే వాడు. 'నువ్వు చెప్పు మామయ్యా. బీజాక్షరాన్ని కూడా సరిగ్గా పలకరేం' అనేవాడు. మా ఊళ్ళోనూ వున్నారు ఒక షాంత, ఒక ష్యామల.

నేను త్రివేండ్రంలో ఉద్యోగంలో చేరిన మొదట్లో మా డ్రాయింగ్ ఆఫీసుకి వెళ్ళి అక్కడి ఇంజనీరింగ్ మేనేజర్ నాయర్‌తో మాట్లాడుతున్నాను. 'ఇది జింక్ మెటీరియల్‌తో చేయాలి' అని ఒక పార్ట్ గురించి చెప్పాను. అతనికి అర్థంకాలేదు. కాదు ఇది సింక్‌తో చేయాలి కదా అన్నాడు. మేం చెప్పేది ఒకళ్ళకొకళ్ళకి అర్థంకాక చూస్తుంటే వచ్చాడు శ్రీనివాసన్. అతను తమిళియన్. ఇంగ్లీష్‌లో జడ్‌ని తెలుగువాళ్ళు జి అనీ, మలయాళీలు సి అనీ పలుకుతారని అతనికి తెలుసు. రెండూ తప్పేనని అతని ద్వారా నేనూ తెలుసుకున్నాను. కొంచెం స అనే శబ్దం తీసుకువస్తూ జి అనే అక్షరం పలికితే సరైన పదానికి ఉచ్చారణ వస్తుంది. సరిగ్గా వ్రాయటనికి ఆ అక్షరం తెలుగు భాషలో లేదు. జడ్ అంటే గుర్తుకి వచ్చింది. మనం ఇంగ్లీషులో జడ్ అనే దాన్ని, అమెరికన్ ఇంగ్లీషులో జీ అంటారు.

ఈ మధ్య తెలుగు సినిమాలలో తెలుగు వింటుంటే, ఆ రోజుల్లో సరదాగా చెప్పుకునే రామునితోక పివర్యుండిట్లనియె అనే మాటలే చాల అర్థవంతంగా కనిపిస్తున్నాయి నాకు.

0 0 0